క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

తంగళ్లపల్లి: మండలంలోని బాలమల్లుపల్లె శివారులోని సోమాయ్ చెరువు వద్ద శుక్రవారం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు గ్రామస్తులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగనాయక సాగర్ నుంచి గోదావరి జలాలు వచ్చి తన గ్రామంలోని సోమాయ్ చెరువు నిండిందని ఆనందం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కస్తూరి లత, గ్రామ అధ్యక్షుడు నరేశ్, నాయకులు కస్తూరి తిరుపతిరెడ్డి, లింగారెడ్డి, కిషన్‌రెడ్డి, బాలకిషన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభ్యసన స్థాయి మెరుగుపర్చాలి



విద్యార్థులను ప్రశ్నిస్తున్న నోడల్ అధికారి

కోనరావుపేట: పాఠశాలల్లోని విద్యార్థుల్లో అభ్యసన స్థాయిని మెరుగుపర్చాలని మండల నోడల్ అధికారి లోకిని శారద అన్నారు. కోనరావుపేట మండలం మరిమడ్ల, కొండాపూర్, నిమ్మపల్లి ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం తనిఖీచేశారు. విద్యార్థుల్లో అభ్యాసన పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల్లో అభ్యాసన పద్ధతులను మెరుగుపర్చడానికి ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. హెచ్‌ఎం సత్తు రవీందర్, ఉపాధ్యాయులు వెంట ఉన్నారు.

కనుల పండువగా ఉమామహేశ్వర కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

గంభీరావుపేట: మండలకేంద్రంలో విశ్వకర్మ మనుమయ సంఘం ఆధ్వర్యంలో ఉమామహేశ్వర కల్యాణోత్సవం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య నిర్వహించిన కల్యాణాన్ని భక్తులు వీక్షించారు. మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, నాయకులు నర్సాగౌడ్, వేడుకల్లో పాల్గొన్నారు. కల్యాణోత్సవాలను సంఘం బాధ్యులు చేపూరి ప్రభాకర్, మిట్టపల్లి రాజు, సంతోష్, రమేశ్, చంద్రమౌళి, శ్రీనివాస్, బాలకిష్టయ్య, లక్ష్మీనారాయణ, సుదర్శనం పర్యవేక్షించారు.

ప్రొసీడింగ్స్ పంపిణీ



ప్రొసీడింగ్స్ అందిస్తున్న ఎంపీపీ, సర్పంచ్

తంగళ్లపల్లి: మండలకేంద్రంలో శుక్రవారం ఎంపీపీ పడిగెల మానస, సర్పంచ్ అంకారపు అనితతో కలిసి 156 మహిళా సంఘాలకు రూ.36 లక్షల వడ్డీలేని రుణాలు ప్రొసీడింగ్స్ కాపీలు పంపిణీచేశారు. ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు పెద్దూరి తిరుపతి, ఎంపీటీసీ కోడి అంతయ్య, ఏపీఎం పర్శరాములు, సీసీ తిరుపతి, వార్డుసభ్యులు,వీవోఏలు, మహిళలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు లబ్ధి



చెక్కులు అందిస్తున్న సర్పంచ్ లత

వీర్నపల్లి: మండలంలోని కంచర్ల, వన్‌పల్లి గ్రామాల్లో శుక్రవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయా గ్రామాల సర్పంచ్‌లు పిట్టల రజిత, జోగినిపల్లి లత పంపిణీ చేశారు. కంచర్ల లబ్ధిదారులు సమీర్‌కు రూ.46వేలు, శేఖర్‌కు రూ.15వేలు వన్‌పల్లి లబ్ధిదారులు కుమ్మరి శంకర్‌కు రూ.32 వేలు, మారుపాక నారాయణకు రూ.11వేలు ఉప్పునూటి కిషన్‌కు రూ.10వేలు విలువైన చెక్కులను అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు హరీశ్, రాజు, సురేశ్, సత్తయ్య, శివసాయి, మల్లయ్య, కిషన్‌రెడ్డి ఉన్నారు.

వ్యాసరచన పోటీలు

చందుర్తి: మండలంలోని బండపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థినులకు రక్తహీనతపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు శుక్రవారం నిర్వహించారు. పోషణ్ పక్వాడ్‌లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు అంగన్‌వాడీ కార్యకర్తలు న్యాత పద్మ, బుర్ర రేణుక తెలిపారు. విజేతలకు సర్పంచ్ న్యాత విజయ బహుమతులు ప్రదానంచేశారు.

పంటల సర్వే నామ మాత్రమే!

- అధికారుల తీరుపై రైతుల కన్నెర్ర
- సర్వే పూర్తిచేశామంటున్న సార్లు..
- సర్వేకు ఎప్పుడు వచ్చారో తెలియదంటున్న అన్నదాతలు
- పంటనష్టపోయిన రైతులు 14 మందేనంటూ అధికారుల అంచనా
- సర్వేచేయకుండానే తెలిసిన వారిపేర్లు రాసి పంపించినట్లు రైతుల ఆరోపణ



రుద్రంగి రైతువేదికలో వ్యవసాయశాఖ అధికారిని నిలదీస్తున్న రైతులు

మా పొలం కాడికి సార్లు రాలే



నాపేరు గాజ నర్సయ్య. రుద్రంగి మండలం. ఆరు ఎకరాల్లో వరిసాగు చేశాను. అందులో నాలుగు ఎకరాలు వడగళ్ల వానకు దెబ్బతింది. దీంతో తీవ్రంగా నష్టపోయాను. అధికారులు పంటనష్టం అంచనాకు వస్తారనుకుంటే ఇప్పటికీ ఎవరూ రాలేదు. పంటపొలాల వద్ద ఎప్పుడు ఒకరు కాపలా ఉంటాం. మాతో పాటు చుట్టుపక్కల రైతులు కాపలా ఉంటారు. వ్యవసాయ అధికారులు సర్వేకు వచ్చినట్లు రైతులు ఎవరూ కూడా చెప్పలేదు.

రుద్రంగి: మండలంలో గత శనివారం కురిసిన వడగళ్ల వానకు పంట పొలాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వార్తా కథనాల ఆధారంగా ఉన్నతాధికారులు, మంత్రులు రైతులకు జరిగిన పంట నష్టంపై సర్వేచేసి నివేదిక పంపాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. దీంతో వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పొలాల వద్దకు వెళ్లకుండానే తమకు కావాల్సిన, తెలిసిన రైతుల పేర్లు, తమ వద్దకు వచ్చిన రైతులపేర్లు మాత్రమే నష్టపోయిన వారిలిస్టులో నమోదు చేసి ఉన్నతాధికారులకు పంపించి నామమాత్రంగా సర్వేచేసి చేతులు దులుపుకున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

పొలాల వద్దే నిత్యం కాపలా..

వడగళ్లు కురిసిన మరునాడు ఆదివారం ఇద్దరు, సోమవారం ఐదుగురు అధికారులు వడగళ్లకు నష్టపోయిన పంటలను సర్వేచేశారని అధికారులు చెబుతున్నా నిత్యం పొలాల వద్దే ఉంటున్న తమకు ఒక్క అధికారి కూడా కనపడలేదని, పంటనష్టం సర్వేకు కనీసం అధికారులు వస్తున్నట్లు, వచ్చినట్లు కూడా సమాచారం లేదని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలో గురువారం రుద్రంగి రైతువేదికకు వచ్చిన వ్యవసాయశాఖ అధికారిని పంటల సర్వే ఎప్పుడు చేశారో చెప్పాలని రైతులు నిలదీశారు. పంటనష్టాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకోవాలని అడిగితే సమయం అయిపోయిందంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

14 మందే నష్టపోయిన రైతులు !

రుద్రంగి మండలంలో 1,429 మంది రైతులు 2,370 ఎకరాల్లో వరి సాగుచేయగా అందులో శనివారం కురిసిన వడగళ్ల వానకు కేవలం 14మంది రైతులే పంట నష్టం చవిచూశారని వ్యవసాయశాఖ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు మండలంలోని రైతులకు తెలియడంతో ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పూర్తిస్థాయిలో పంటల సర్వేచేయకుండానే కూర్చున్న చోటే తమకు కావాల్సిన వారి వివరాలు నివేదికలో ఎలా పంపుతారని అధికారుల తీరుపై మండిపడ్డారు. మళ్లీ క్షేత్రస్థాయిలో పంటల పరిశీలనకు వచ్చి పంటనష్టాన్ని అంచనా వేసి నివేదిక పంపాలని డిమాండ్ చేస్తున్నారు.

మళ్లీ సర్వే..

వడగళ్లు కురిసిన మరుసటి రోజు ఆదివారం ఇద్దరు ఏఈవోలతో, సోమవారం ఐదుగురు ఏఈవోలతో సర్వే చేయించాం. 14 మందే వరి సాగుచేసిన రైతులకు నష్టం వాటిల్లింది. ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. సమయం అయిపోయిందంటూ వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తెలపడంతో ఈ విషయాన్ని 'సాక్షి' ప్రతినిధిని సంప్రదించారు. దీంతో 'సాక్షి' ఇటు రైతులను అటు వ్యవసాయ శాక అధికారులను ప్రశ్నించడంతో మళ్లీ సర్వేచేసి పంట నష్టాన్ని అంచనా వేయనున్నట్లు తెలిసింది.

సమయం అయిపోయిందంటా..



నేను నాలుగు ఎకరాల్లో వరి సాగుచేశాను. వడగళ్ల వానకు పంటనష్టం వాటిల్లింది. దీంతో పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లతో గురువారం రుద్రంగి రైతువేదికలో వ్యవసాయశాఖ అధికారికి ఇచ్చేందుకు వెళ్లాను. సర్వేచేశాం సమయం అయిపోయిందంటూ జిరాక్సులు తీసుకోలేదు. నేను ఎప్పుడూ పొలం వద్దే ఉంటా. ఎప్పుడు సర్వేచేశారో నాకు తెలియదు. మా పొలం వద్దకు ఎవరూ సర్వేకు రాలేదు. అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో సర్వేచేసి న్యాయంచేయాలి.

– గడ్డం నారాయణ, రైతు, రుద్రంగి

సర్వేచేశాం



వడగళ్ల పడిన మరుసటి రోజు ఆదివారం ఇద్దరు, సోమవారం ఐదుగురు ఏఈవోలతో ఫీల్డ్ సర్వే చేయించాం. వారు ఇచ్చిన నివేదిక ప్రకారం నష్టపోయిన పంటల వివరాలు ఉన్నతాధికారులకు పంపించాం.

– వెంకట రామమ్మ, ఇన్‌చార్జ్ ఏవో, రుద్రంగి

గ్రామాల రూపురేఖలు మారాయి



సన్మానిస్తున్న ఆగయ్య, సభ్యులు



ప్రశంసాపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే



అవార్డు అందుకుంటున్న సర్పంచ్, కార్యదర్శి

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య
- అందుకు ఈ అవార్డులే నిదర్శనం
- ఉత్తమ సేవలకు గుర్తింపు
- జీపీలు, సర్పంచులకు సన్మానం
- సర్పంచులను అభినందించిన ఎమ్మెల్యే
- అవార్డు అందుకున్న ప్రజాప్రతినిధులు

ఎల్లారెడ్డిపేట/బోయినపల్లి/వేములవాడరూరల్/తంగళ్లపల్లి/గంభీరావుపేట/వేములవాడఅర్బన్/చందుర్తి/వీర్నపల్లి/కోనరావుపేట: రాష్ట్రప్రభుత్వ హయాంలో జిల్లాలోని అన్ని గ్రామాలు అభివృద్ధిలో దూసుకెళ్లాయని, అందుకు కేంద్రప్రభుత్వం అందించిన అవార్డులే నిదర్శనమని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలపరిషత్‌లో 24 గ్రామపంచాయతీలకు మంజూరైన అవార్డులను వారికి అందించి సన్మానించారు. పరిసరాల పరిశుభ్రత, మొక్కల పెంపకం, పల్లెప్రకృతి వనాలు,డంపింగ్‌యార్డులు వంటి అంశాలతో గ్రామాల రూపురేఖలు మారాయన్నారు. గ్రామాల్లో సర్పంచ్‌లు చేపడుతున్న పలు అభివృద్ధి పనులను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు గుర్తించి అవార్డులు అందించాయి ఈక్రమంలో దీన్ దయాల్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్‌లో ఎంపికైన బోయినపల్లి మండలంలోని పలు గ్రామాల సర్పంచులను ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శుక్రవారం క్యాంపు కార్యాలయంలో అభినందించారు. పురస్కారంలో ఎంపికైన గ్రామపంచాయతీ సర్పంచులకు ప్రశంసా పత్రాలు అందించడంతో పాటు శాలువాతో సన్మానించారు. పల్లెప్రగతితో గ్రామాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని జెడ్పీచైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. జాతీయ పంచాయతీ అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమాన్ని కోనరావుపేట మండల పరిషత్‌లో నిర్వహించారు. ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డు పొందిన సర్పంచ్, ఎంపీటీసీ, కార్యదర్శులను సన్మానించారు. ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భా గంగా వేములవాడ రూరల్ మండలంలోని 17 గ్రామాల్లోని సర్పంచ్‌లకు ఈ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో వారికి అవార్డు అందించి శాలువాతో సన్మానించారు. పలు కేటగిరీల్లో ఉత్తమ గ్రామపంచాయతీలుగా గుర్తింపు పొందిన గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పడిగెల మానస, జెడ్పీటీసీ పూర్మాని మంజుల ఆధ్వర్యంలో సన్మానించారు. శాలువాతో సన్మానించి జ్ఞాపికలు, ఉత్తమ గ్రామపంచాయతీ ధృవీకరణ పత్రాలు అందించి సర్పంచులు, కార్యదర్శులను అభినందించారు. గంభీరావుపేట మండలస్థాయిలో ఎంపికైన జీపీలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వంగ కరుణ అవార్డులు ప్రదానం చేశారు. చందుర్తి మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు దీన్ దయాల్ ఉపాధ్యాయ పంచాయత్'' సతత్ వికాస్ పురస్కార్‌లను చందుర్తి రైతువేదికలో జెడ్పీటీసీ సభ్యులు నాగంకుమార్ ఎంపీపీ, లావణ్య, ఎంపీడీవో రవీందర్ ఆధ్వర్యంలో అవార్డులు, ప్రశంసాపత్రాలు అందించారు. వీర్నపల్లి రైతువేదికలో వివిధ అభివృద్ధి పనులకు మండలంలోని 17 జీపీలు ఉత్తమ జాతీయ అవార్డులు గెలుచుకున్నాయి. ఎంపీపీ మాలోత్ భూల సర్పంచ్‌లకు ప్రశంసాపత్రం, అవార్డులు అందించారు. అనంతరం సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

కరపత్రాలు ఆవిష్కరణ

సిరిసిల్లటౌన్: సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 26, 27 తేదీల్లో నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల కరపత్రాలను సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రావణపల్లి మల్లేశం ఆవిష్కరించారు జనచైతన్య యాత్ర కరపత్రాలను వైపని వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిరిసిల్ల కార్మిక భవనంలో శుక్రవారం ఆవిష్కరించారు.

పోషకాహారంపై అవగాహన

వేములవాడరూరల్: మండలంలోని వట్టెంల అంగన్‌వాడీకేంద్రంలో పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిన్నారులు,బాలింతలకు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం..

ఎల్లారెడ్డిపేట: సీఎం సహాయనిధి నిరుపేదలకు వరంగా మారిందని ఎంపీపీ పిల్లి రేణుక అన్నారు. అల్మాస్‌పూర్, రాచర్లగొల్లపల్లి గ్రామాల్లో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

సింగిల్‌విండో అభివృద్ధికి సమష్టిగా కృషిచేయాలి

సిరిసిల్లఅర్బన్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పెద్దూరు సింగిల్‌విండో చైర్మన్ జీల కిషన్‌యాదవ్ అన్నారు. పెద్దూరు సింగిల్‌విండో కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించి ఆదాయ, వ్యయ, లాభనష్టాలపై చర్చించారు. రైతుల శ్రేయస్సే లక్ష్యంగా సమష్టిగా కృషి చేయాలన్నారు.

బోరుబావి పనుల ప్రారంభం

బోయినపల్లి: మండలంలోని దేశాయిపల్లిలో మండల పరిషత్ నిధులు రూ. 1.50 లక్షల అంచనాలతో ఏర్పాటు చేసిన బోరు, మోటార్ పనులను ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచు ఒంటెల రాజగోపాల్‌రెడ్డి, నాయకులు కొంకటి మధు, ఎమిరెడ్డి మల్లారెడ్డి, గోపు శ్రీనివాసరెడ్డి, ఐరెడ్డి మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఒడ్డెరలు అన్నిరంగాల్లో రాణించాలి

గంభీరావుపేట: ఒడ్డెర కులస్తులు అన్నిరంగాల్లో రాణించాలని ఒడ్డెర సంఘం కార్మికశాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్ల వెంకటి అన్నారు. గంభీరావుపేట మండలకేంద్రంలో రాజేశ్వర్‌రావునగర్ గ్రామంలో ఒడ్డెరసంఘం జెండావిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. ఒడ్డెర కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించాలని, ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎల్లయ్య, నాయకులు ఉపేంద్ర, కర్రొల్ల రాజు, మంగళి చంద్రమౌళి, హమీద్, స్వామి, శివకృష్ణ, బిక్షపతి, దోసల చంద్రం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్లు పంపిణీ

తంగళ్లపల్లి: మండలంలోని గండిలచ్చపేటలో యువకులకు సర్పంచ్ సీరటి లక్ష్మీ శుక్రవారం క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. యువత చదువతోపాటు క్రీడాల్లోనూ రాణించాలన్నారు.

ఉచిత బస్‌పాసులు పంపిణీ

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లిలో సర్పంచ్ గనప శివజ్యోతి ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత బస్‌పాసులు పంపిణీచేశారు. బస్‌పాస్‌లను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి

ముస్తాబాద్: కంటివెలుగు పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 'కంటివెలుగు' ఇన్‌చార్జి వైద్యాధికారి భాష కోరారు. ముస్తాబాద్ మండలం పోతుగల్‌లో 'కంటివెలుగు' శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. కంటి సమస్యలున్న వారు పరీక్షలు చేసుకోవాలని సూచించారు. అవసరమైన వారికి కంటి అద్దాలు ఉచితంగా అందిస్తున్నారన్నారు. సర్పంచ్ తన్నీరు గౌతంరావు, మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్, వైద్యాధికారి గీతాంజలి, ఉపసర్పంచ్ మంజుల, ఎంపీటీసీ బాలకిషన్, సీహెచ్‌వో యాదగిరి, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వీర్నపల్లి: గ్రామస్తులు 'కంటివెలుగు' వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని బంజేరు సర్పంచ్ గుగులోత్ కళా అన్నారు. శుక్రవారం గ్రామపంచాయతీ భవనంలో 'కంటివెలుగు' శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యశిబిరంలో హాజరైన వారికి వైద్యులు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి కళ్లద్దాలు అందించారు.

గాంధీ విగ్రహం ఎదుట మౌనదీక్ష



ముస్తాబాద్‌లో కాంగ్రెస్ నాయకుల నిరసన

ముస్తాబాద్/తంగళ్లపల్లి: రాహుల్‌గాంధీపై అనర్హత వేటుకు నిరసనగా.. ముస్తాబాద్‌లో జీపీ కార్యాలయంలోని గాంధీ విగ్రహం ఎదుట కాంగ్రెస్ నాయకులు శాంతియుతంగా మౌనదీక్ష చేపట్టారు. నోటికి నల్లరిబ్బన్లు ధరించి కేంద్రంలో బీజేపీ వైఖరిని ఖండిస్తూ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. రాహుల్‌గాంధీపై పెట్టిన కేసులకు వ్యతిరేకంగ తంగళ్లపల్లి మండలకేంద్రంలోని మహాత్మగాంధీ విగ్రహం ఎదుట కాంగ్రెస్ అధ్యక్షుడు జాలగం ప్రవీణ్(టోని)గంటసేపు మౌనదీక్ష చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, డీసీసీ కార్యదర్శి రాజిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బుర్రరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల భూపతి, నేరెళ్ల నర్సింగం గౌడ్, మచ్చ శ్రీనివాస్, గుగ్గిళ్ల శ్రీకాంత్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

టీబీ నియంత్రణపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ముస్తాబాద్: క్షయవ్యాధి నియంత్రణపై పోతుగల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది శుక్రవారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్షయవ్యాధికి పోతుగల్ ఆరోగ్యకేంద్రంలో మంచి వైద్యం అందిస్తున్నామని వైద్యాధికారులు గీతాంజలి, వేణు తెలిపారు. ఎవరైన దగ్గు, జ్వరంతో బాధపడితే పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం పీహెచ్‌సీలో గుండెపోటుపై సీపీఆర్ శిక్షణ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. గుండెపోటుకు గురైన వ్యక్తికి సకాలంలో సీపీఆర్ అందిస్తే ప్రాణాలు నిలబెట్టవచ్చన్నారు. సీహెచ్‌వో యాదగిరి, స్టాఫ్ నర్స్‌లు, ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

పెద్ద చెరువు నీటి తరలింపుపై రైతుల ఆందోళన



వృథాగా పోతున్న నీటిలో రైతుల ఆందోళన

ముస్తాబాద్: మండలకేంద్రంలోని పెద్దచెరువు నీటి తరలింపుపై ముస్తాబాద్ రైతులు ఆందోళనను వ్యక్తం చేశారు. పెద్దచెరువు తూం నుంచి ఇష్టానుసారంగా నీటిని తరలిస్తున్నారని రైతులు శుక్రవారం అక్కడికి చేరుకుని మాట్లాడారు. చెరువులోని నీటిని పోతుగల్ పొలాలకు తరలించేందుకు షట్టర్‌ను ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నీటిపారుదలశాఖ అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని రైతులు కనమేని లింగారెడ్డి, బాల్‌రెడ్డి, బాలయ్య, శ్రావణ్, శ్రీరాములు, పెద్దరాములు, శంకర్ అన్నారు. దొంగచాటుగా అర్ధరాత్రి వేళ షట్టర్లను పూర్తిగాతెరిచి, నీటిని అక్రమంగా తరలిస్తున్నారన్నారు. దీంతో నీరు వృథాగా పోతోందని చెరువులో నీటిమట్టం తగ్గి భూగర్భజలాలు అడుగంటుతున్నాయన్నారు. ముస్తాబాద్ రైతులకు నష్టం జరుగుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

కస్టమర్ల సహకారంతో బ్యాంకు అభివృద్ధి

- పారదర్శకంగా సేవలు అందించాలి..
- టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్
- పలు అంశాలపై సభ్యుల అభ్యంతరం..



మాట్లాడుతున్న గూడూరి ప్రవీణ్

సిరిసిల్లటౌన్: కస్టమర్ల సహకారంతో సిరిసిల్ల అర్బన్ బ్యాంకు దినదినాభివృద్ధి చెందుతోందని టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ అన్నారు. శుక్రవారం బ్యాంకు ఇన్‌చార్జి చైర్మన్ గడ్డం విఠల్ అధ్యక్షతన నిర్వహించిన అర్ధవార్షిక సభలో పాల్గొని మాట్లాడారు. సహకార స్ఫూర్తితో కస్టమర్లకు పారదర్శక సేవలు అందించాలన్నారు. సభ్యుల సూచనలు కోరగా..బియ్యంకార్ శ్రీనివాస్, రాగుల రాములు, బొద్దుల లక్ష్మినారాయణ, సామల మల్లేశం తదితరులు మాట్లాడారు బ్యాంకు ఉద్యోగులకు పీఆర్సీ, సభ్యులకు డివిడెండ్ ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. సహకార స్ఫూర్తిని దెబ్బతీసేలా సాగిస్తున్న పాలన బ్యాంకు అభివృద్ధికి ఏమాత్రం సరికాదన్నారు. పలు అంశాలపై ప్రశ్నించిన సభ్యులకు సరైన సమాధానాలు రాకపోవడంతో కొంత రసాభాసగా మారింది. రిటైర్డ్ ఉద్యోగిని సీఈవోగా నియమించారని ఆ స్థానంలో రెగ్యులర్ ఉద్యోగిని నియమించాలన్నారు. సభ్యుల సూచనలు పరిశీలించి పరిగణలోకి తీసుకుంటామని ఇన్‌చార్జి చైర్మన్ గడ్డం విఠల్ వివరించారు. కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు మందాడి శ్రీనివాస్‌రెడ్డి, బొద్దుల భాస్కర్, కోడం సంజీవ్, స్వర్గం రాజు, అడ్డగట్ల శారద, అడిచెర్ల సాయికృష్ణ, ఆడెపు అనసూర్య, నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, వేముల రాములు, సీఈవో ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆశపడి మోసపోకండి




వేములవాడరూరల్: సోషల్ మీడియాలో వస్తున్న ప్రకటనలు చూసి ఆశపడి మోసపోవద్దంటూ వేములవాడ రూరల్ ఎస్సై నాగరాజు అన్నారు. రూరల్ మండలం చెక్కపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ వాట్సప్‌లలో వివిధ రకాల ప్రకటనలు, లింకులుపెట్టి సైబర్ నేరగాళ్లు మోసాలకు గురిచేస్తున్నారని, అలాంటి వాటిపై జాగ్రత్తగా ఉండాలన్నారు. బ్యాంకు వివరాలు, వ్యక్తిగత వివరాలు ఎవరికి చెప్పొద్దని సూచించారు. అత్యవసర సమయంలో 100 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. గ్రామాల్లో ఇప్పటికీ మూఢనమ్మకాలతో కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని, అలాంటి వాటిని నమ్మిమోసపోవద్దని సూచించారు. యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని చదువుపై శ్రద్ధవహించి లక్ష్యం చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

తంగళ్లపల్లి: మండలంలోని చీర్లవంచలో సిరిసిల్ల రూరల్ సీఐ బి.ఉపేందర్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, గంజాయి వాడకంతో కలిగే దుష్పరిణామాలు వివరించారు.. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటుతో కలిగే లాభాలు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కుల రవీందర్, ఉప సర్పంచ్ కోగిలంచ బ్రహ్మం, తంగళ్లపల్లి ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నోరూరించే హలీమ్



వేములవాడ: పట్టణంలో రంజాన్ మాసం సందర్భంగా హలీమ్ సెంటర్‌ను ఎన్‌ఆర్‌ఐ తోట రామ్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. చికెన్, మటన్ హలీమ్‌తో పాటు రెండు రకాల స్వీట్లు అందుబాటు లో ఉన్నాయని హోమ్‌టౌన్ నిర్వాహకులు మొట్టల మహేశ్ తెలిపారు. రంజాన్ ఉపవాసాల సందర్భంగా ముస్లింలు, పట్టణ, పరిసర గ్రామాల ప్రజలకు రుచికరమైన ఆహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.